క్లుప్తంగా

సమన్వయంతో విధులు నిర్వర్తించాలి



మాట్లాడుతున్న సీడీపీఓ తార

టేకులపల్లి: ఆరోగ్య సంరక్షణలో అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వర్తించాలని ఐసీడీఎస్ టేకులపల్లి సీడీపీఓ కేఎం తార సూచించారు. బోడు పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేజ్ శానిటేషన్ హెల్త్ న్యూట్రిషన్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతీ అంగన్‌వాడీ టీచర్, ఆశా కార్యకర్త తమ పరిధిలోని అందరూ పోషకాహారం తీసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. బోడు పల్లె దవాఖానా వైద్యురాలు రుక్సానా, సులానగర్ పీహెచ్‌సీ సూపర్‌వైజర్ విజయ, మాట్లాడగా బాలకృష్ణ, నాగుబండి వెంకటేశ్వర్లు, సక్కుబాయి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించండి

టేకులపల్లి: గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని అన్ని పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు భూక్యా కిషోర్‌సింగ్, ప్రధాన కార్యదర్శి ఎస్.కృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. పలు డిమాండ్లతో గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయుల ఉమ్మడి ఖమ్మం జిల్లా కమిటీల ఆధ్వర్యంలో ఈ నెల 9న రెడ్డి సత్రం భద్రాచలంలో జరగనున్న గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయుల జిల్లా సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సమ్మెతో డ్రైవర్లకు సంబంధం లేదు




మాట్లాడుతున్న శంకర్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో కాంట్రాక్ట్ వాహన యజమానులు చేస్తున్న సమ్మెకు డ్రైవర్లకు ఎటువంటి సంబంధం లేదని కాంట్రాక్ట్ కార్మిక హక్కుల పరిరక్షణ సంఘం అధ్యక్షుడు రాసూరి శంకర్ అన్నారు. శుక్రవారం సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వారు పెట్టిన డిమాండ్లలో డ్రైవర్ల సమస్యలు లేకపోగా సీఎంపీఎఫ్‌ను పూర్తిగా రద్దు చేయాలని కోరటం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

కేసు ఎత్తివేయాలి

ఇల్లెందు: కామేపల్లి మాజీ జెడ్పీటీసీ మేకల మల్లిబాబు యాదవ్ మీద పండితాపురంలో జరిగిన అల్లర్లలో ముద్దాయిగా చేర్చి అక్రమంగా కేసు నమోదు చేశారని, తక్షణం ఆ కేసు ఎత్తివేయాలని అఖిల భారత యాదవ మహాసభ ఇల్లెందు మండల అధ్యక్షుడు పుట్టా ఉపేందర్ యాదవ్, పట్టణ ఉపాధ్యక్షుడు మేకల నాగేష్, కొమురయ్య, వీరస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం ఇల్లెందులో వారు మాట్లాడుతూ.. రాజకీయ కక్షతో జరిగిన గొడవలో మల్లిబాబుకు సంబంధం లేకపోయినా కావాలనే ఇరికించారని తెలిపారు. అధికార పార్టీ నేతల ఆదేశంతో మల్లిబాబు మీద నమోదు చేసిన కేసు ఎత్తివేయాలని కోరారు. ఈర్ల శ్రీకాంత్, ముడిగ శ్రీను, కార్తీక్ యాదవ్, శ్రీకాంత్ యాదవ్, రమేష్ యాదవ్, వెంకటేష్, ప్రభాకర్, ఉపేందర్, రవి, భూషయ్య, ఉపేందర్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న కార్మికులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న మహిళా కార్మికులకు నెలల తరబడి బిల్లులు, వేతనాల చెల్లించకుండా చట్టబద్ధ హక్కులు కల్పించకుండా రాష్ట్ర ప్రభుత్వం గోసపెడుతోందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుత్తుల సత్యనారాయణ, మిడ్ డే మీల్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్తెనపల్లి విజయలక్ష్మి అన్నారు. సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించి కలెక్టర్ అనుదీప్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఉప్పుట్టి రాహుల్, అన్నవరపు వెంకటేశ్వర్లు, ప్రభావతి, మంగ, శ్రీదేవి, లక్ష్మి, రాధ, ఆకుల పద్మ, కాంత, అరుణ తదితరులు పాల్గొన్నారు.

ముద్ద మింగుడు పడడం లేదు..

- కిన్నెరసాని గిరిజన ఆశ్రమ క్రీడా పాఠశాల విద్యార్థుల ఇక్కట్లు
- స్టీమ్ కుక్కర్ పాడైనా పట్టించుకోని వైనం
- కట్టెలపై వండుతుండగా సరిగ్గా ఉడకక ఇబ్బందులు



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న దృశ్యం

పాల్వంచరూరల్: నిరుపేద గిరిజన విద్యార్థుల చదువుల కోసం ఉచితంగా చదువులు, భోజన సౌకర్యం కోసం ఐటీడీఏ ప్రతిరోజూ లక్షల ఖర్చు చేస్తున్నా ప్రభుత్వ లక్ష్యం నేరవేరడం లేదు. ముద్దగా అన్నం వండిపెట్టడంతో విద్యార్థులు వారం రోజులుగా ఇక్కట్లకు గురవుతున్నారు. మండల పరిధి కిన్నెరసానిలోని గిరిజన ఆశ్రమ క్రీడా పాఠశాలలో 5నుంచి 10వ తరగతి వరకు 248 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. పాఠశాలలో స్టీమ్ కుక్కర్ ద్వారా విద్యార్థులకు ప్రతిరోజూ వంట వండిపెడుతున్నారు. అయితే వారంరోజుల క్రితం స్టీమ్‌కుక్కర్ చెడిపోయింది. దీంతో దానిని పక్కన పడేశారు. కట్టెల పొయ్యిపై భోజనాలు వండి పెడుతున్నారు. కట్టెల పొయ్యిపై వండిన భోజనం ముద్దగా తయారవుతోందని తినలేకపోతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులకు వండే వంటలను గ్యాస్‌పై గానీ, స్టీమ్‌పై గానీ తయారు చేయాలని ఉన్నతాధికారులు గతంలో ఆదేశాలు జారీ చేశారు. అయినా నేటికీ పాఠశాలలో కట్టెల పొయ్యిపైనే వంటలు వండుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.



ముద్దగా అయిన అన్నం



చెడిపోవడంతో పక్కన పడేసిన కుక్కర్

పర్యవేక్షణ కరువు...

మండలంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్స్‌లో నిత్యం విద్యార్థుల మెనూ పర్యవేక్షణ చేయాల్సిన ఏటీడీఓ అధికారి పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడంతో విద్యార్థులకు హాస్టల్స్ సంక్షేమాధికారులు పెట్టిందే మెనూ అన్నట్లుగా ఉంది. దీంతో విద్యార్థులు ఈ విషయాన్ని బయటకు చెప్పుకోలేక తీవ్ర పడుతున్నారు. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

స్టీమ్ కుక్కర్ మరమ్మతు చేయిస్తాం



పాఠశాలలో వంటలు వండే స్టీమ్ కుక్కర్ చెడిపోయింది. అయితే బాగుచేయాలని మెకానిక్‌కు చెప్పాము. దీనికి సంబంధించిన సామగ్రి స్థానికంగా దొరకపోవడంతో విజయవాడ నుంచి తెప్పించాల్సి ఉంది. దీంతో సకాలంలో మరమ్మతు చేయడం సాధ్యం కావడం లేదు. త్వరలో చేయిస్తాం.

– చందు, హెచ్ఎం, కిన్నెరసాని అశ్రమ క్రీడాపాఠశాల

రేపు ఎస్సీ, ఎస్టీ, బీసీల సెమినార్



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

పాల్వంచ: జాతీయ ఎస్సీ, ఎస్టీ, బీసీల నిరుద్యోగ యువకులు, మహిళల సమస్యలపై జూలై 9న హైదరాబాద్‌లో జరగనున్న జాతీయ సదస్సును విజయవంతం చేయాలని రాష్ట్ర కార్యదర్శి కాల్వ భాస్కర్ రావు, పాల్వంచ పట్టణ అధ్యక్షుడు కాల్వ ప్రకాశ్ రావు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. జాతీయ స్థాయిలో రిజర్వేషన్ విధానాన్ని క్రమేణా తీసేసేందుకు బీజేపీ, కొన్ని పార్టీలు చేసే చర్యలకు నిరసనగా సెమినార్‌ను నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రైవేట్ రంగంలో సైతం రిజర్వేషన్ అమలు చేయాలని పేర్కొన్నారు. అంబేద్కర్ జీవిత చరిత్రను అన్ని పాఠ్యాంశాల్లో చేర్చాలని, కొత్త పార్లమెంట్‌కు అంబేద్కర్ పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం సెమినార్ కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో ఎలుక రామస్వామి, ముళ్లపాటి రాజేంద్రకుమార్, దాసరి నాగేశ్వరరావు, జూపుడి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు కేసు పెట్టి ఏడేళ్లు వేధించారు..

టేకులపల్లి: 2015లో చేతి వృత్తిదారులకు బీసీ కార్పొరేషన్ రుణాలు మంజూరు చేశారు. దీనిలో అవకతవకలకు పాల్పడినట్లు 2017లో నాపై తప్పుడు కేసును పెట్టి వేధించారని జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం నాయకుడు తాడోజు భిక్షమయ్య ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. రుణాలకు నాకూ ఎటువంటి సంబంధం లేకపోయినా కాగితాల నాగభూషణం, రమేష్, వెంకటరమణచారి, ఆకారపు వెంకటాచారిలు నాతో పాటు జలేంద్రాచారిపై తప్పుడు కేసు బనాయించారని వాపోయా రు. ఏడేళ్లుగా కోర్టు వాయిదాలకు తిప్పి ఆర్థికంగా, మానసికంగా తీవ్ర ఇబ్బందులకు గురిచేసినట్లు చెప్పారు. విశ్వబ్రాహ్మణ సంఘంలో నా ఎదుగుదల చూసి ఓర్వలేక కుట్ర పన్నారని తెలిపారు. ఈ కేసులో కోర్టు నన్ను నిర్దోషిగా గుర్తించి కేసు కొట్టివేసినట్లు చెప్పారు. కులసంఘంలో ఇటువంటివి పునరావృతం కాకూడదని కోరుకుంటున్నానని పేర్కొన్నారు.

బోనస్ చెల్లించకపోవడంపై ఆగ్రహం

టేకులపల్లి: ఎండలో 10 నుంచి 20 కిలోమీటర్లు కాలినడకన వెళ్లి అడవిలో తునికాకు కోసి కాంట్రాక్టర్‌కు ఇచ్చామని ఆకు డబ్బులు ఇచ్చారు కానీ, బోనస్ మాత్రం ఇవ్వడం లేదని బాధిత గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం బద్దుతండా, నంద్యాతండా, మద్దిరాలగుంపు గ్రామాలకు చెందిన బాధితులు విలేకరులతో మాట్లాడారు. ఈ మూడు గ్రామాలకు చెందిన 200మందికి పైగా గిరిజనులు తునికాకు సేకరించారు. ఆకు కోసినందుకు వారికి డబ్బులు కూడా ఇచ్చారు. కానీ 2013 నుంచి 2018 వరకు బోనస్ డబ్బులు రావాల్సి ఉంది. నెల రోజుల క్రితమే బోనస్ డబ్బులు విడుదలయ్యాయి. సంబంధిత కల్లేదారు ఆకు కోసిన వారి పేర్లు, బ్యాంకు ఖాతా వివరాలు అన్నీ సేకరించి అటవీ శాఖాధికారులకు అందజేస్తే వారు లబ్ధిదారుల ఖాతాల్లో బోనస్ డబ్బులు జమ అవుతాయి. అయితే ఈ మూడు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు బోనస్‌కు సంబంధించి సమాచారం ఇవ్వలేదని, పేర్లు, బ్యాంకు ఖాతా వివరాలు తీసుకోలేదని బాధితులు ఆరోపించారు. వారం రోజుల క్రితమే కొందరు వారికి తునికాకు బోనస్ డబ్బులు వచ్చాయని చెబితే మాకు తెలిసిందని కల్లేదారుని అడిగితే సరైన సమాధానం రావడం లేదని వాపోయారు. ఈ విషయమై అటవీ అధికారుల దృష్టికి తీసుకెళ్తామని బాధితులు తెలిపారు. ఆరుగాలం కష్టపడి ఆకు కోస్తే బోనస్ రాకపోవడం ఏమిటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. ఇదిలా ఉండగా ఆకులు కోయని, ఒకే కుటుంబంలో ఎక్కువ మంది ఖాతాల్లో తునికాకు బోనస్ డబ్బులు పడినట్లు చర్చ జరుగుతోంది.



నంద్యాతండాలో మాట్లాడుతున్న గిరిజనులు

సీఎం కేసీఆర్‌కు గుణపాఠం తప్పదు

తమ డిమాండ్లను పరిష్కరించాలని పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మె శుక్రవారం రెండోరోజుకు చేరింది. సమ్మె శిబిరాన్ని వివిధ రాజకీయ పార్టీలు సందర్శించి సంఘీభావం ప్రకటించారు. మాట్లాడుతూ.. ఏళ్ల నుంచి కార్మికులతో వెట్టిచాకిరీ చేయించుకుంటున్న ప్రభుత్వం వేతనాలను పెంచకపోవడం సరికాదన్నారు. తక్షణమే డిమాండ్లను పరిష్కరించాలని లేదంటే వచ్చే ఎన్నికల్లో కేసీఆర్‌కు తగిన గుణపాఠం తప్పదన్నారు. మల్టీ వర్కర్ విధానం కార్మికుల ఆత్మాభిమానాన్నిదెబ్బ తీయడమే కాకుండా ప్రమాదానికి గురిచేసే విధంగా ఉందని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. – సాక్షి నెట్‌వర్క్



ఇల్లెందురూరల్: మాట్లాడుతున్న ఎన్డీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు మధు



పాల్వంచరూరల్: తహసీల్ ఎదుట చంటిబిడ్డతో సమ్మెలో మమత తదితరులు



టేకులపల్లి: మాట్లాడుతున్న సీతారామయ్య



సుజాతనగర్: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు

13న విద్యా సంస్థలు బంద్

సింగరేణి(కొత్తగూడెం): ఈ నెల 13న ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్ర విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మంచికంటి భవన్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో విద్యాసంస్థల సమస్యల పరిష్కారానికై తలపెట్టిన ఈ బంద్‌లో విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నేడు చలో హైదరాబాద్

టేకులపల్లి: హైదరాబాద్‌లోని బంజారా భవన్‌లో శనివారం జరగనున్న గిరిజన ఆశ్రమ పాఠశాల కాంట్రాక్టు ఉపాధ్యాయ అభినందన సభను విజయవంతం చేయాలని గిరిజన ఆశ్రమ పాఠశాల కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్స్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. అభినందన సభకు అందరూ కుటుంబ సభ్యులతో హాజరు కావాలన్నారు.

7లోగా కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలోని కాంట్రాక్ట్ కార్మికులకు ప్రతినెల 7వ తేదీలోగా కాంట్రాక్టర్లు వేతనాలు చెల్లించాల్సి ఉంటుందని, లేకపోతే వారికి బిల్లులు నిలిపేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారని బీకేఎంఎస్ జాతీయ కార్యదర్శి పి.మాధవనాయక్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో బీఎంఎస్ జాతీయ నాయకుడు కొత్తకాపు లక్ష్మారెడ్డి కాంట్రాక్టు కార్మికుల సమస్యను వివరించారని చెప్పారు. దీంతో అధికారులు స్పందించి కార్మికులకు ప్రతినెల 7వ తేదీలోగా వేతనాలు చెల్లించేలా ఆదేశాలు జారీ చేశామని తెలిపారు.

'దేశీ' డిప్లొమా సర్టిఫికెట్ల అందజేత



సన్మాన గ్రహీతలతో అధికారులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): వ్యవసాయ అధీకృత డీలర్లకు డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ సర్వీసెస్ ఫర్ ఇన్‌పుట్ డీలర్స్ (దేశీ) కోర్సు పూర్తయిన సందర్భంగా నాలుగు, ఐదు బ్యాచ్‌లకు శుక్రవారం లక్ష్మీదేవిపల్లి మండలం లోతువాగు రైతువేదికలో జరిగిన కార్యక్రమంలో సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి కొర్స అభిమన్యుడు మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంలో రోజువారీ సమస్యలు, యాజమాన్య పద్ధతులు, మెళకువలు, నూతన సాంకేతిక పరిజ్ఞానం వంటి సేవలపై పూర్తిస్థాయిలో ఈ శిక్షణలో అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఇప్పటికే 320 మంది డీలర్లు శిక్షణ పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలువురికి సన్మానం చేశారు.

కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖాధికారి జినుగు మరియన్న, కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మీనారాయణమ్మ, డీపీఆర్‌టీ శ్రీనివాసరావు, ఏడీఏ లాల్‌చంద్, ఏఓ దీపక్ ఆనంద్, ఫెసిలిటేటర్లు డేవిడ్ జైపాల్‌రావు, దామోదర్‌రెడ్డి, కేవీకే శాస్త్రవేత్తలు విశ్వతేజ, శివ తదితరులు పాల్గొన్నారు.

పోడు పట్టాలిస్తున్నాం.. అండగా ఉండండి



పోడు పట్టా అందజేస్తున్న ఎమ్మెల్యే వనమా

పాల్వంచరూరల్: ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని పోడు భూములకు పట్టాలు ఇస్తున్నాం.. సీఎం కేసీఆర్‌కు అండగా ఉండాలని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక పాత ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం 374మంది గిరిజన రైతులకు 834 ఎకరాల పోడు భూములకు ఎమ్మెల్యే పట్టాలు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పోడు భూములకు పట్టాలు ఇచ్చి గిరిజనుల జీవితాల్లో వెలుగు నింపారన్నారు. రాష్ట్రంలో 4.60 లక్షల ఎకరాలకు పోడు పట్టాలు ఇస్తే భద్రాద్రి జిల్లాలో 1.60 లక్షల ఎకరాలకు పట్టాలు ఇచ్చినట్లు చెప్పారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి నాయకులు, రైతులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో వనమా రాఘవేందర్ రావు, కొత్వాల శ్రీనివాసరావు, ఎంపీడీఓ బి.అప్పారావు, ఏఓ శంభోశంకర్, ఆర్ఐ హచ్యా, బరపటి వాసుదేవరావు, ఎంపీపీ మడివి సరస్వతి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కేజీబీవీలో సమస్యలు పరిష్కరించాలి

టేకులపల్లి: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సేవాలాల్ సేన జిల్లా ఇన్‌చార్జ్ మాళోతు శివనాయక్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శుక్రవారం సంఘం ఆధ్వర్యంలో నాయకులతో కలిసి కేజీబీవీని సందర్శించారు. ముఖాముఖి నిర్వహించి విద్యార్థుల సమస్యలు తెలుసుకున్నారు. పిల్లలు ఉంటున్న రెండు అంతస్తుల తరగతి గదికి ఇప్పటి వరకు విద్యుత్ కనెక్షన్ లేదని, కేజీబీవీ నుంచి పది మీటర్ల దూరంలోనే విద్యుత్ సబ్‌స్టేషన్ ఉన్నప్పటికీ విద్యుత్ కనెక్షన్ ఇవ్వడంలో అధికారులు నిర్లక్ష్యంగా చేస్తున్నారని చెప్పారు. బాత్ రూం డోర్లు కూడా లేని దుస్థితి ఉందని, ఉన్నతాధికారులు స్పందించి సత్వరమే సమస్యలు పరిష్కరించాలని లేకపోతే సేవాలాల్ సేన ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

ఐఎన్‌టీయూసీ జెండా ఎగురవేస్తాం..



ఏరియా వర్క్‌షాపులో మాట్లాడుతున్న త్యాగరాజన్

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలో రానున్న గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ జెండా ఎగురవేస్తామని ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ త్యాగరాజన్ తెలిపారు. శుక్రవారం ఏరియా వర్క్‌షాపులో పనిచేస్తున్న సుమారు 20 మంది కార్మికులు ఐఎన్‌టీయూసీలో చేరారు. వీరికి యూనియన్ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూనియన్ సెక్రటరీ జనరల్ ఆదేశానుసారంగా ఏరియాలో బాయిబాట కార్యక్రమం యూనియన్ ఉపాధ్యక్షుడు కే అల్బర్ట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ సంవత్సరం కంపెనీ సాధించిన రూ.2,222 వేల కోట్ల లాభాల్లో కార్మికులకు 35శాతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే వీకే ఓపెన్‌కాస్ట్ ఎన్విరాల్‌మెంట్ అనుమతి త్వరగా వచ్చే విధంగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షుడు ఆల్బర్ట్, ఎస్ సాలమన్, రాజేశ్వరరావు, అశోక్, ఎస్ లక్ష్మణ్‌రావు, కాలువ నాగభూషణం, వై.శంకర్, భిక్షపతి, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

కూనంనేని అరెస్ట్‌పై నిరసన



మాట్లాడుతున్న సాబీర్‌పాషా

సింగరేణి(కొత్తగూడెం): విభజన చట్టాలను తుంగలో తొక్కి రాజకీయ కక్షతో తెలంగాణకు అడుగడుగునా అన్యాయం చేస్తున్న నరేంద్రమోదీకి తెలంగాణ గడ్డపై అడుగు పెట్టే అర్హత లేదని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా అన్నారు. విభజన హామీలను విస్మరించి మోదీ తెలంగాణలో పర్యటిస్తున్న సందర్భంగా వరంగల్‌లో చేపట్టిన నిరసన కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తక్కెళ్లపల్లి శ్రీనివాస్‌రావు ఇతర నాయకుల అరెస్టును నిరసిస్తూ శుక్రవారం బస్టాండ్ సెంటర్‌లోని అమరవీరుల స్తూపం వద్ద నల్లదుస్తులతో సీపీఐ శ్రేణులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సాబీర్‌పాషా మాట్లాడారు. మోదీ గడిచిన తొమ్మిదేళ్లలో తెలంగాణకు ఏం చేశారో చెప్పాలని నిలదీస్తున్న తెలంగాణ సమాజానికి సమాధానం చెప్పిన తరువాతనే పర్యటించాలన్నారు. విభజన చట్టంలోని బయ్యారం ఉక్కు పరిశ్రమ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు, సాగునీటి ప్రాజెక్ట్‌లకు జాతీయ హోదా వంటి హామీలను నెరవేర్చకుండా కేంద్రం తెలంగాణపై వివక్ష చూపుతోందన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే నిరవధిక సమ్మె

చుంచుపల్లి: సమస్యలను పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా నిర్లక్ష్యం చేయడం వల్లనే గ్రామ పంచాయతీ కార్మికులు నిరవధిక సమ్మె చేస్తున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు.

కనీస వేతనాలు, పనిభద్రత, చట్టబద్ధ హక్కులు డిమాండ్ చేస్తూ గ్రామ పంచాయతీ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం రెండో రోజుకు చేరుకుంది. విధులను బహిష్కరించిన చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి మండలాల పరిధిలోని గ్రామ పంచాయతీ కార్మికులు పట్టణంలోని బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన నిరసన శిబిరాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా సందర్శించి మాట్లాడారు. గుత్తుల శ్రీనివాస్, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

'బ్రాహ్మణగర్జన'ను విజయవంతం చేయండి



పెద్దమ్మతల్లిని దర్శించుకున్న బ్రాహ్మణ సంఘం నేతలు

పాల్వంచరూరల్: హైదరాబాద్ ఎల్‌బీ నగర్‌లోని సరూర్‌నగర్ స్టేడియం గ్రౌండ్‌లో ఆదివారం జరగనున్న బ్రాహ్మణగర్జన మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం మండలంలోని పెద్దమ్మగుడి వద్ద బ్రాహ్మణులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ద్విచక్ర వాహనాలపై కేశవాపురం, లక్ష్మీదేవిపల్లి మీదుగా పాల్వంచ పట్టణంలోని నవభారత్ శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం వరకు వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ఎస్‌వీఆర్‌కే ఆచార్యులు, అంజనేయశర్మ, కార్యదర్శి వేణుగోపాలచారి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత బస్సు సౌకర్యం..

సింగరేణి(కొత్తగూడెం): ఈ నెల 9న హైదరాబాద్ సరూర్‌నగర్‌లో నిర్వహించే బ్రాహ్మణ గర్జన సభకు కొత్తగూడెం వేద విద్యా పరిషత్ నుంచి ఆదివారం ఉదయం ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలంగాణ బ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షుడు రామానుజన్ శర్మ తెలిపారు. శుక్రవారం సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉదయం 6 గంటలకు బస్సు సంఘం కార్యాలయం నుంచి బయలుదేరుతుందని, బ్రాహ్మణోత్తములు ఉదయం 5.30 గంటలకు అందరు హాజరుకాగలరని కోరారు.



అటెన్షన్ ప్లీజ్

మురుగు నీటిని తొలగించండి..

ఇల్లెందు మండలంలోని రొంపేడు గ్రామపంచాయతీ కేంద్రంలో ఇళ్లలో ఉపయోగించిన వృథా నీరు కాల్వల ద్వారా గ్రామశివారుకు చేరుతుంది. అక్కడి నుంచి వెళ్లేందుకు కాలువ లేకపోవడంతో సీసీ రోడ్డుపైనే నిల్వ ఉంటోంది. ప్రస్తుతం వానాకాలం మురుగు అత్యధికంగా నిలిచి ఉండటంతో పాకురు పట్టి, దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో సమీప ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు వెంటనే చర్యలు గ్రామస్తులు కోరుతున్నారు. – ఇల్లెందురూరల్



ప్రశ్నించాల్సిన అధికారి : అన్వేష్, గ్రామ కార్యదర్శి, రొంపేడు
సెల్ నెంబర్: 8328058308